# సర్వీస్ రోడ్డు లేక ప్రాణాల మీదికి..

- కట్టంగూర్ రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని జీఎంఆర్ అధికారులు
- సర్వీస్‌రోడ్డు నిర్మించాలని స్థానికుల వేడుకోలు



సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రాంగ్‌రూట్‌లో వస్తున్న ప్రయాణికులు(ఫైల్)

కట్టంగూర్, డిసెంబర్ 4: 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరించిన తరువాత కట్టంగూర్ మండల కేంద్రం ప్రమాదాలకు నిలయంగా మారింది. మండల కేంద్రంలో విస్తరణ పనులను చేపట్టిన జీఎంఆర్ సంస్థ బస్టాండ్ నుంచి కురుమర్తి రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డును కురుమర్తి రోడ్డు వరకు నిర్మించాల్సి ఉన్న హైవే అధికారులు మాత్రం బస్టాండ్ వరకు నిర్మించి చేతులు దులుపుకున్నారు. దాంతో కురుమర్తి నుంచి కట్టంగూర్, నల్లగొండకు వెళ్లే వాహనాల దారులు సర్వీస్ రోడ్డు లేక పోవడంతో రాంగ్‌రూట్‌లో వెళ్తుండడంతో మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా ప్రతి శనివారం కట్టంగూర్‌లో జరిగే వారంతపు సంతకు ఇందిరమ్మ, పద్మశాలి కాలనీ ప్రజలతో పాటు కురుమర్తి నుంచి వచ్చే వాహన దారులు రాత్రి సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాంగ్‌రూట్‌లో వెళ్తూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు మిగిలిన సర్వీస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### కురుమర్తి రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాలి



జాతీయ రహదారి విస్తరణలో గ్రామంలో కురుమర్తి రోడ్డు వరకు సర్వీస్ రోడ్డు వేయకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు కాలనీల ప్రజలు సర్వీస్ రోడ్డు లేకపోవడంతో జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సి వస్తుంది. సర్వీస్ రోడ్డు నిర్మించాలని పలు మార్లు హైవే అధికారులకు తెలియజేసిన స్పందించడం లేదు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి

– గోశిక భాగలక్ష్మి, వార్డు సభ్యురాలు

# హైవేపై అగ్నికీలలు

- నల్లగొండ శివారులో అర్ధరాత్రి ట్రావెల్స్ బస్సు దగ్ధం
- గాఢ నిద్రలో ఉన్న ఒకరి సజీవ దహనం
- అద్దాల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్న ప్రయాణికులు



కాలిపోతున్న ట్రావెల్స్ బస్సు

నీలగిరి, డిసెంబర్ 4 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో షార్ట్ జరిగి బస్సు పూర్తిగా దగ్దమైంది. ప్రమాదంలో ఒకరు సజీవ దహనం కాగా.. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ కృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 38 మంది ప్రయాణికులు, డ్రైవర్, హెల్పర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి చీరాలకు బయల్దేరింది. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి మీదుగా వెళ్తున్న బస్సు సోమవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో నల్లగొండ జిల్లా కేంద్రం శివారు పానగల్ సమీపంలోకి రాగానే ఏసీ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. ఈ సమయంలో బస్సులోని ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారు. గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కన నిలిపి ప్రయాణికులను నిద్రలేపారు. ప్రయాణికులంతా బస్సు అద్దాలు పగులగొట్టి బయటకు దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. మంటలు ఎగిసిపడి బస్సు పూర్తిగా కాలిపోయింది. ఒకరు మాత్రం బయటికి రాలేక సజీవ దహనమైనట్లు తోటి ప్రయాణికులు చెబుతున్నారు. ఆ వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. కాలిపోయిన వ్యక్తి శరీర భాగాలు, ఎముకలను గుర్తించిన పోలీసులు వివరాలు తెలుసుకునేందుకు ఎముకలను ల్యాబ్ కు తరలించారు. మిగిలిన ప్రయాణికులకు చిన్న, చిన్న గాయాలయ్యాయి.. ప్రమాదం ఏమీ జరుగలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రయాణికుల లగేజ్, బంగారంతోపాటు అమెరికా వెళ్లాలనే ఓ అమ్మాయి వీసా పాస్‌పోర్టు కాలిపోయినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## విద్యార్థి ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

రామన్నపేట, డిసెంబర్ 4 : మండలంలోని బోగారం గ్రామానికి చెందిన విద్యార్థి ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోగారం గ్రామానికి చెందిన చిల్లర వెంకటరమణ(19)హైదరాబాద్ బోడుప్పల్ లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆరోగ్యం బాగాలేక పోవడంతో వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం కుదుట పడడంతో ఆదివారం వెంకటరమణను కళాశాలకు వెళ్లమని కుటుంబ సభ్యులు సూచించారు. దాంతో వెంకటరమణ సాయంత్రం బైక్ తీసుకొని బయటకు వెళ్లాడు. రాత్రి పొద్దు పోయేవరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆయన వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో రామన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం తెల్లవారుజామున రామన్నపేట శివారులోని రైలు పట్టాలపై శవమై కనిపించాడు. హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తున్నది. మృతుడి సోదరుడు మహేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నల్లగొండ మున్సిపల్ చైర్మన్ ఇంటిపై కాంగ్రెస్ దాడి

- సైదిరెడ్డి భార్యతోపాటు తల్లిపైన దౌర్జన్యం
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



దాడికి దిగుతున్న భాస్కర్‌గౌడ్, ఆయన అనచరులు

నీలగిరి, డిసెంబర్ 4 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఆయన ఇంటి బయట పటాకులు కాలుస్తూ ఈలలు, కేరింతలు చేసి ఇంటి ఆవరణలో ఉన్న చైర్మన్ భార్య, తల్లిపై దాడి చేశారు. దాంతో ఇరు వర్గాలు నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం శాసనసభ ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తరువాత కాంగ్రెస్ కార్యకర్తలు పలు కాలనీల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో 16వ వార్డు కౌన్సిలర్ భర్త జెర్రిపోతుల భాస్కర్‌గౌడ్, తన సోదరులు, మరికొంత మందితో వచ్చి చైర్మన్ ఇంటి ముందు పటాకులు కాలుస్తూ దూషణలు చేశారు. ఆ సమయంలో చైర్మన్ సైదిరెడ్డి ఇంట్లో లేరు. పటాకుల నిప్పురవ్వలు ఎగిసి ఇంట్లో పడుతుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న చైర్మన్ భార్య చేతిలో ఉన్న ఫోన్‌ను గుంజుకునేందుకు ఆమె వద్దకు వచ్చారు. మా ఇంటి ముందుకు రావడమే కాకుండా మహిళపైకి ఎందుకు వస్తున్నారని చైర్మన్ తల్లి అడ్డుపడడంతో ఆమెపై కూడా దాడి చేశారు. విషయం తెలిసిన చైర్మన్ తన అనుచరులతో కలిసి ఇంటి వద్దకు వచ్చేలోగా అక్కడి నుంచి వారు జారుకున్నారు. ఈ సంఘటనపై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో చైర్మన్ సైదిరెడ్డి కేసు పెట్టారు. కాగా తన కారును ధ్వంసం చేశారని కౌన్సిలర్ భర్త భాస్కర్‌గౌడ్ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐలు తెలిపారు.

## కలెక్టరేట్‌కు రిజర్వ్ ఈవీఎంలు



రిజర్వ్ ఈవీఎంలను వాహనాలలోకి తరలిస్తున్న సిబ్బంది.

నకిరేకల్, డిసెంబర్ 4 : నకిరేకల్ నియోజకవర్గానికి సంబంధించిన రిజర్వ్ ఈవీఎంలను నల్లగొండ కలెక్టరేట్‌కు సోమవారం తరలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన 116 వీవీ ప్యాట్‌లు, 77 సీయూ, 147 బీయూ బాక్సులను సంబంధిత వాహనాల్లో సిబ్బంది భద్రపరిచారు. భద్రపర్చిన బాక్సులను నల్లగొండ కలెక్టరేట్‌లోని ఈవీఎం మెయిన్ గోదాంలోకి భద్రతా బలగాల మధ్య తరలిస్తున్నట్లు సహాయ ఎన్నికల అధికారి జి. ప్రసాద్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన పత్రాలను ట్రెజరీ శాఖకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆత్మజ్ఞాన సదస్సు

భూదాన్ పోచంపల్లి డిసెంబర్ 4 : పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 5,6 ,7, తేదీల్లో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భారత పురుషోత్తం, నోముల అశోక్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మాతా శివానంద చైతన్య తపోవన ఆధ్వర్యంలో ప్రవచనాలు జరుగునని తెలిపారు. ఆలయంలో మత్ భగవద్గీత సామూహిక పారాయణం, లలిత సహస్రనామ సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట ఆధ్యాత్మిక భక్త సమాజం ఉపా ధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రతినిధులు సుంకి వెంకటేశం, పుప్పాల నాగేశ్వర్, కన్వీనర్ సీత సత్యనారాయణ, సభ్యులు చిట్టిప్రోలు గోవర్ధన్, ఎలగందుల రవీందర్, రుద్ర వెంకటయ్య, ఎలగందుల నర్సింహ, భువనగిరి యాదగిరి, కొంక వీరేశం పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి

రామగిరి, డిసెంబర్ 4 : పద్మశ్రీ దివంగత ఘంటసాల జయంతిని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ సినీ విమర్శక అవార్డు గ్రహీత డాక్టర్ పురుషోత్తమచార్యులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఘంటసాల జీవిత అంశాలను, పాటల విషయాలను వివరించారు. అనంతరం 30 మంది గాయనీ, గాయకులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు గజవెల్లి సత్యం అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, జెల్లా పుల్లయ్య, గోపాల్‌రెడ్డి, ఎన్‌సీ పద్మ, అమృతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘంటశాల జయంతిలో మాట్లాడుతున్న డాక్టర్ పురుషోత్తమాచార్యులు

## 10న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

రామగిరి, డిసెంబర్ 4: నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) 2023-24 పరీక్ష ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు http://bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం

చౌటుప్పల్, డిసెంబర్ 4 : మండలకేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్ప ఆలయంలో సోమవారం మాలధారులకు అన్నదానం నిర్వహించారు. డాక్టర్ సుమన్ కళ్యాణ్, జ్యోతి దంపతులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్వాములు కామిశెట్టి భాస్కర్ గుప్తా, బొబ్బిళ్ల మురళి, తూర్పాటి శంకర్, దాచేపల్లి ప్రకాశ్ గుప్తా, మొగుదాల రమేశ్ గౌడ్, చింతల సాయిలు పాల్గొన్నారు.

## నేడు చౌటుప్పల్ మండల సమావేశం

చౌటుప్పల్ డిసెంబర్ 4 : చౌటుప్పల్ మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సందీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## రేపు శాలిగౌరారం మండల సమావేశం

శాలిగౌరారం, డిసెంబర్ 4 : శాలిగౌరారం మండల సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రేఖల లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి సర్పంచులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.